క్లుప్తంగా

బీజేపీ కార్యాలయం ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో బీజేపీ కార్యాలయాన్ని భద్రాచలం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలంలో బీజేపీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్, నాయకులు బిట్ర గుంట కాంతికుమార్,చింతలచెరువు శ్రీనివాస రావు, కణితి లక్ష్మి, వసంతరావు, త్రినాథ్‌రెడ్డి, తెల్లం చలపతి, అపకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరులను స్మరించుకుందాం..

ములకలపల్లి: ఆశయ సాధనకు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరులను స్మరించుకుందామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల అధ్యక్షుడు కొర్సా రామకృష్ణ అన్నారు. మండలపరిధిలోని మొగరాలగుప్ప గ్రామంలో పార్టీ మండలకమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అమరవీరుల సంస్మరణసభలో ఆయన మాట్లాడారు. భూమికోసం, భుక్తికోసం, పీడిత ప్రజల విముక్తి కోసం అమరులైనవారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కోండ్రు నగేశ్, కొర్సా పోతురాజు, కీసరి శేఖర్‌బాబు, కొర్సా వెంకటేశ్, సున్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం కాలనీ గ్రామానికి చెందిన కాటూరి చిలకయ్యను అదే గ్రామానికి చెందిన కలపాల మంగరాజు పాత గొడవల నేపథ్యంలో కంకర రాయితో కొటడంతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన చిలకయ్యను స్థానికులు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. అనంతరం తనపై దాడికి పాల్పడిన మంగరాజుపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోశాలకు విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోశాల నిర్మాణానికి ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన ఓ భక్తులు శనివారం విరాళం అందజేశారు. ఏలూరు పట్టణానికి చెందిన సాంబశివరావు–సుభద్ర దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను దాతలకు అందజేశారు. ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌చార్జ్

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును, బీఆర్‌ఎస్ పార్టీ, అశ్వారావుపేట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేను ఆయన నివాసం తాటిసుబ్బన్నగూడెంలో కలసిన ఉప్పల వెంకటరమణను, ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రస్తుతం నియోజకవర్గంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితులు, పరిణామాల గురించి చర్చించారు. నాయకులు పైడి వెంకటేశ్వరరావు, రావు జోగేశ్వరరావు, దొడ్డాకులు రాజేశ్వరరావు, పర్వతనేని రామకృష్ణ, రమేష్, నాగమణి పాల్గొన్నారు.

రేగా గెలుపు కోసం పూజలు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రేగా కాంతారావు గెలుపును కాంక్షిస్తూ మల్లెలమడుగు సర్పంచ్ కోడి కృష్ణవేణి, ఉపసర్పంచ్ చావా రాఘవులు, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో శనివారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మల్లెలమడుగు గ్రామంలోని మల్లికార్జునస్వామి, శివాలయం, నెల్లిపాకబంజరలోని వెంకటేశ్వరస్వామి, సమ్మక్క–సారలమ్మ ఆలయాల్లో పూజలు కొనసాగాయి. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

భద్రాచలం: బీఆర్‌ఎస్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టి బంగాళాఖాతంలో కలపాలని భద్రాచలం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య అన్నారు. తొలుత ఆయన భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానం, చర్చి, మసీదులలో ప్రార్థనలు చేశారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి, మన్యంవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలు హామీలతో గత ఎన్నికలలో ప్రజలను మోసం చేసిన కేసీఆర్ మళ్లీ అమలు కానీ హామీలతో మోసం చేయటానికి వస్తున్నాడని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమాల్లో టీపీసీసీ నాయకులు బుడగం శ్రీనివాస్, నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు నాగ సతీష్, నరేష్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

- అభివృద్ధిని వివరిస్తూ బీఆర్‌ఎస్..
- లోపాలను ఎత్తిచూపుతున్న కాంగ్రెస్
- ఇరువురి నోటా మేనిఫెస్టో అంశాలు



మణుగూరురూరల్: ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు



భద్రాచలం: గ్రౌండ్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న తాతా మధు, వెంకట్రావ్



చర్ల: సరిహద్దులోని కుర్నపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంట ఏరియాలో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు. మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో పినపాక నియోజవర్గాన్ని అభివృద్ధి పథాన నడిపించానని తెలిపారు. అభివృద్ధిని చూసి 30వ తేదీన జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, ఎస్.రమేష్, మహిళా నాయకులు, యువజన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ గ్రౌండ్‌లో..

భద్రాచలం: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ తాతా మధులు ప్రచారం నిర్వహించారు. వాకింగ్ చేస్తున్న వారితో మాటా మంతి చేశారు. భద్రాచలంలో బీఆర్‌ఎస్‌కు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. అనంతరం వెంకట్రావ్ పట్టణంలోని శాంతి నగర్‌తో పాటుగా ఇతర కాలనీలలో ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా వెంకట్రావ్‌ను గెలిపించాలని కోరుతూ భద్రాచలం మండల ఉపాధ్యక్షుడు నర్రా రాము, డివిజన్ యూత్ అధ్యక్షుడు మల్లెల లోకేషులు 146వ బూత్‌లో ప్రచారం చేశారు.

ఎమ్మెల్యే మెచ్చా ఆధ్వర్యంలో..

అన్నపురెడ్డిపల్లి: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. శనివారం మండలంలోని అన్నపురెడ్డిపల్లి, తొట్టిపంపు, బుచ్చన్నగూడెం, మర్రిగూడెం, అబ్బుగూడెం గ్రామాల్ల ప్రచారం నిర్వహించారు.తొలుత అన్నపురెడ్డిపల్లి శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రచారంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భారత లాలమ్మ, ఎంపీపీ సున్నం లలిత, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి,నాయకులు భారత రాంబాబు, చల్లా రాంబాబు, జంగల ఉమ, కొత్తూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం, చిరుమళ్ల ఎస్సీ కాలనీ, గాంధీనగర్, ఇప్పచెట్టు గుంపులలో బీఆర్‌ఎస్ విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వెన్న అశోక్ కుమార్ మరోమారు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నిట్టా ఏడుకొండలు, నాయకులు చిట్టిమల్ల ప్రవీణ్, పలు మండలాల సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మున్సిపాలిటీలోని సుందరయ్యనగర్‌లో బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు, పీవీకాలనీలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు శనివారం ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి రేగా కాంతారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పీవీ కాలనీ ప్రచారంలో భాగంగా తొలుత టీబీజీకేఎస్ నాయకులు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు వీరభద్రయ్య, కాపా శివాజీ, ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ, సీహెచ్‌వీ రెడ్డి, బి.కృష్ణ, బి.వెంకటేశ్వర్లు, ఎం.రమేష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి నవీన్ సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

చర్ల: మండలంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. శనివారం కిష్టారంపాడు, బత్తినపల్లి, బట్టీగూడెం, రామచంద్రాపురం, పెదమిడిసిలేరు, కుర్నపల్లి, బోదనెల్లి, ఎర్రబోరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తొమ్మిదేళ్లలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ వైఫల్యాలను, ఎన్నికలను ముందు బీఆర్‌ఎస్ ఇస్తున్న అమలు కానీ హామీలపై నాయకులు ఆదివాసీలు, గిరిజనులకు వివరించారు. గతంలో రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సందర్భంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మళ్లీ అధికారంలోకి వచ్చే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి చెప్పారు.టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, చీమకుర్తి వీరభద్రం, దేవభక్తుని రామకృష్ణ, సుందరి సురేష్, ఎలకం నరేంద్ర, ఇందుల బుచ్చిబాబు, కారంపూడి సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల అసత్య ప్రచారాన్ని అడ్డుకుంటాం..



మాట్లాడుతున్న ఉప్పల వెంకటరమణ

అశ్వారావుపేట: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వయసును, అనుభవాన్ని తాము గౌరవిస్తామని.. కాని ఆయన చేస్తున్న అసత్యప్రచారాన్ని మాత్రం అడ్డుకుంటామని అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అశ్వారావుపేటలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా వారికి తుమ్మల, పొంగులేటి అనే రెండు రిమోట్‌లు ఉంటాయన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు ప్రజలే రిమోట్ అన్నారు. మెచ్చా నాగేశ్వరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట అశ్వారావుపేట ఎంపీపీ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడు చిట్టూరి ఫణీంద్ర, దమ్మపేట సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు, మందపాటి రాజమోహనరెడ్డి, యూఎస్ ప్రకాశరావు, గొడవర్తి వెంకటేశ్వరరావు, తూతా నాగమణి తదితరులున్నారు.

పర్ణశాలలో పునర్వసు కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా శనివారం మాస కల్యాణం నిర్వహించారు.ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకుని వచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యూత్రా ధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మధుపర్కాలు,మహా సంకల్పం మంగళాష్టకాలు, జీలకర బెల్లం మాంగల్య పూజ మాంగల్య ధారణ మంగళ హారతి, మంత్రపుష్పం చేపట్టి కల్యాణతంతు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, అమరవాది కిశోర్‌కుమార్ చార్యులు, ఆలయ సూపరింటెండెంట్ కిషోర్, ఇన్‌చార్జ్ ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

షర్మిలమ్మ బాటలోనే నడుస్తాం..

ములకలపల్లి: వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలమ్మ బాటలతోనే తమ ప్రయాణం కొనసాగిస్తామని పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి సోయం కృష్ణ స్పష్టం చేశారు. ములకలపల్లిలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలన అంతమొందించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌తో కలసి సాగేందుకు షర్మిల తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. ఆ నిర్ణయం ప్రకారమే పార్టీకి లోబడి భవిష్యత్‌లో కొనసాగుతామని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రాంబాబు, జల్లారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానమే కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు

మణుగూరురూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల నాయకులతో కలిసి వివిధ పాఠశాలలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మణుగూరు బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్ట్ తీర్పు ప్రకారం ఉద్యోగికి పెన్షన్ చెల్లించడం ప్రభుత్వాల సామాజిక బాధ్యత అన్నారు. కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగి పదవి విరమణ తర్వాత ఉద్యోగులు అభద్రతాభావంతో ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీరాహుస్సేన్, మండల ప్రధాన కార్యదర్శి కారం సీతారామయ్య, జిల్లా కార్యదర్శి బి.రాము, సంఘ సభ్యులు పూజిత, ఇంద్రసేనారెడ్డి, బి.భాస్కరరావు, పాఠశాల హెచ్‌ఎం స్వర్ణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

బూర్గంపాడు: ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖ అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేస్తున్నారు. మోరంపల్లిబంజర వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో శనివారం ఓ కారులో తీసుకెళ్తున్న రూ 1.2 కోట్ల నగదును పోలీసులు పట్టుకున్నారు. అయితే ఆ నగదుకు సంబంధించిన ఆధారాలను చూపటంతో నగదును ఇచ్చేశారు. భద్రాచలం నుంచి కొత్తగూడెంకు ఓ బ్యాంకు సిబ్బంది ఈ నగదును తీసుకెళ్తున్నట్లు ఆధారాలు చూపటంతో నగదును వారికి ఇచ్చేశారు.

పాఠాలు బోధించిన పంచాయతీ కార్యదర్శి

దుమ్ముగూడెం: మండలంలోని బండారు కొత్తగూడెం పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు శనివారం పాఠాలను బోధించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో ఉన్న విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. బోర్డుపై రాసిన తెలుగు పదాలను విద్యార్థులతో చెప్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు మండల అధ్యక్షుడు రాజీనామా

అశ్వారావుపేట: బీఆర్‌ఎస్‌కు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండి పుల్లారావు శనివారం రాజీనామా ప్రకటించారు. ఆయన నివాసంలో నిర్వహించిన సమావేశంలో తన రాజీనామాను వెల్లడించారు. ఆయనతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ రాజీనామాలను తెలియజేశారు.

పార్టీలో చేరిక..

బూర్గంపాడు: సారపాకలోని శ్రీరాంపురంకు చెందిన పలు కుటుంబాలు శనివారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాయి. పార్టీలో చేరినవారికి ప్రభుత్వ విప్ రేగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, కామిరెడ్డి రామకొండారెడ్డి, షఫీ, నాగేశ్వరరావు, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరలేదు..

దుమ్ముగూడెం: మండలంలోని కమలాపురం పంచాయతీ సర్పంచ్ కొమరం బాలరాజు కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నానని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సొంత పనుల నిమిత్తం భద్రాచలం వెళ్లగా అక్కడ శివరామకృష్ణ అనే వ్యక్తి ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకుని వెళ్లి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పడం జరిగిందని, తనకు కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగనున్నట్లు తెలిపారు.

సీపీఎం అభ్యర్థులను అసెంబ్లీకి పంపాలి



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ నుంచి అభ్యర్థులు పోటీలో ఉంటారని, వారిని ఓటర్లు ఆదరించి అసెంబ్లీకు పంపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో శనివారం ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవకాశవాద, డబ్బు రాజకీయాలు, మతోన్మాద శక్తులను ఓడించి సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థి ఈ నెల 9వ తేదీన నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ వూకే వీరాస్వామి, నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, శ్రీధర్, పిట్టల అర్జున్, బి.వీరభద్రం, బి.చిరంజీవి, రామిరెడ్డి, మోరంపూడి శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: ప్రజా సమస్యలపై అనునిత్యం పనిచేసే సీపీఎం అభ్యర్థిని అసెంబ్లీకి పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ పట్టణ జనరల్ బాడీ సమావేశం ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సీపీఎం పోటీ చేస్తుందని, పార్టీ అభ్యర్థి ఈ నెల 8న నామినేషన్ వేస్తారని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్, పార్టీ సీనియర్ నాయకుడు మాజీ డీసీసీబీ చైర్మన్ ఎలమంచి రవికుమార్, జిల్లా నాయకుడు మధు, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా రమేష్, ఎం.రేణుక, సున్నం గంగ, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లు దాఖలు

అశ్వారావుపేట: అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి తొలి నామినేషన్ శనివారం దాఖలయింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు నామినేషన్ పత్రాలను ఆయనను బలపరిచిన దొడ్డా శ్రీరామమూర్తి రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబుకు సమర్పించారు. నామినేషన్‌లో పొందుపరచిన అఫిడవిట్‌లో ఆయన, ఆయన సతీమణి శ్యామల ఆస్తులు, అప్పుల వివరాలను తెలియజేశారు. మెచ్చా నాగేశ్వరరావు చరాస్థులు రూ.కోటి 4లక్షల, 41వేల 440గా, స్థిరాస్తులు రూ.50లక్షల 49వేలుగా అఫిడవిట్‌లో చూపారు. అప్పులను రూ.16లక్షల 08వేల 529గా పొందుపరిచారు. ఎమ్మెల్యే సతీమణి శామల చరాస్తులు రూ.33లక్షల 50వేల 806గా, స్థిరాస్తులు రూ.63లక్షల 18వేలుగా, అప్పులు రూ.లక్షా 08వేల 464గా చూపారు.

పాయం వెంకటేశ్వర్లు..

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు శనివారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రెండు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, వాటిని ఐటీడీఏ పీవో, పినపాక రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం బయట పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అడుగడుగునా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు నీరాజనం పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతంలో 100 మీటర్ల మేర 144 సెక్షన్ అమలులో ఉండగా సీఐ రమాకాంత్, ఎస్‌ఐలు శ్రీనివాస్, రాజేశ్ బందోబస్తు నిర్వహించారు. పాయం వెంట డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి, కాటబోయిన నాగేశ్వరరావు, సామా శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

భద్రాచలంలో నో నామినేషన్..

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు రెండో రోజు శనివారం ఎవరూ ముందుకు రాలేదు. ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటుగా ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయలేదు. కాగా ఈ నెల 6, 9వ తేదీలలో ముహూర్త బలం ఉండటంతో ఆ రోజుల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఓటుహక్కుపై అవగాహన



విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బూర్గంపాడు: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజారావు సూచించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, కేజీబీవీల లోని విద్యార్థులకు శనివారం ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకుని మంచి పాలకులను ఎన్నుకోవాలన్నారు. యువత తాము ఓటు వేయటంతో పాటుగా కుటుంబసభ్యులు, బంధు మిత్రులందరితో ఓటు వేసేందుకు సంసిద్ధులను చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై కళాజాతా



కళాజాతాలో భాగంగా బ్యాంక్ సేవలపై మ్యాజిక్ షో నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మణుగూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్యాంక్ సేవలపై, ఆర్థిక అక్షరాస్యతపై శనివారం కళాజాతా, మ్యాజిక్ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపాజిట్లు, రికవరీ, ప్రమాదబీమా పథకాలైన ప్రధాన మంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సహజ మరణం అటల్ పెన్షన్ యోజన, రూపేకార్డ్, విద్యా, వ్యవసాయం, వ్యాపార అభివృద్ధి రుణాలు, డ్వాక్రా రుణాలు, జీరో అకౌంట్స్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంక్ సేవలపై కెఎస్ రూరల్ మీడియా వారు మ్యాజిక్ షోను నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శివకిషోర్, ఎఫ్ఓ గౌతమ్, విఏఓ ఎస్ నఫీజ్, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమితిసింగారంలో వైద్యశిబిరం



మణుగూరురూరల్: పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివకుమార్

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామ పంచాయతీల ఉన్న పలు గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. జ్వరపీడితుల రక్తనమూనాలను సేకరించి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటి సర్వే చేశారు.

కాగా, డాక్టర్ శివకుమార్ శనివారం పీహెచ్‌సీలో ఇద్దరు గర్భిణులకు కాన్పు చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. సూపర్‌వైజర్ జానకి, రాంప్రసాద్, పుష్ప, రవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం..

కరకగూడెం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కరకగూడెం ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం రాయనపేట గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి సుమారు 70 మంది రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యంపై జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.